ఆ రోజుల్లో మేం ఫోటోలు తీయించుకోవడం ఎరుగము. ఇప్పుడు తీయించుకుందామా అంటే మా అందరి తలలూ నెరిసి పోయినాయి. కొందరికైనా పళ్ళూడిపోయినాయి. ఎందరో కాలం చేశారు. అమృతహస్తులు ! అజాతశత్రులు ! ఆజానుబాహులు !

* "Matriculate or no matriculate.
All succumb to the same fate;
Especially to-day in this Madras State.
Alas, no rice, no sugar,
No brinjai, no betelnut;
Don't you drive your chariot.
My lad! along the same rut."

* షరా :—చుక్కగుర్తుగల ఇంగ్లీషు ముక్కలు నావాణి నుండి స్వయంగా వెలువడ్డాయి. తప్పులు లేవని ఏ "బర్కు"కో కట్టబెట్టేరు కనుక !

....

శూన్యాకాశ విచింతనం

నేను లోగడ వ్రాసిన వ్యాసాల్లో 1899, 1902, 1903 మున్నగు సంవత్సరాలను గురించి పేర్కొని వుంటినా, ఎక్కడైనా, ఆ విశేషం నా పూరా జ్ఞాపక శక్తి మీద ఆధారపడి వుండలేదని పాఠకులు తెలిసికొందురు గాక ; కొంతవరకూ వారూ వీరూ అనుకొన్న దాన్ని బట్టి, కొంతవరకూ ఊహావేశాన్ని బట్టి నా వాక్కుకు ఊతం యిచ్చి రచించివున్నాను.

సరిగ్గా మా వాళ్ళు నాకు అక్షరాభ్యాసం చేసి ఉంటే దుర్ముఖి నామ సంవత్సర మార్గశిర బహుళ అమావాస్యనాడు

జరిగివుండి వుండాలి. ఏమో? ఆనాటికి నాకు 5 ఏళ్ళు 5 నెలల 5 రోజుల యీడు వచ్చేసి తీరాలి కాబట్టి లెక్కించి చూడండి. నందనకు విజయ, విజయకు జయ, జయకు మన్మథ, మన్మధకు దుర్ముఖి నాలుగు వెళ్ళి అయిదోఏడుగదా. మఱి ఆషాఢమునకు శ్రావణం, శ్రావణమునకు భాద్రపదం, భాద్రపదమునకు ఆశ్వయుజం, ఆశ్వయుజమునకు కార్తీకం, నాలుగు నెలలు వెళ్ళి అయిదోనెల గదా! కార్తీకమునకు మార్గశిరం అయిదునెలలూ మార్గశిర బహుళ ఏకాదశికి పూర్తి—పైని అయిదురోజులు అమావాస్యకు పూర్తి—ఆనాడా వుత్సవం జరక్కపోయి వుంటే అమావాస్య మూలాన్ని జరక్కపోయి వుండాలి. మఱిన్నీ మాసానాం మార్గశీర్షం శ్రేష్టం!

ఈ విషయమై నే నీ మధ్యను మా గ్రామవాస్తవ్యులైన బ్రహ్మశ్రీ చతుర్వేదుల శీతారామయ్యగారితో ముచ్చటించగా ఆయన వల్ల తెలిసిన సంగతి ఏమిటంటే "నాయనా! నిన్ను బర్లో పడేసింది నేను కాదు. అవుధానుల కృష్ణయ్యగారు" అని చెప్పారు. ఏ సంవత్సరం అయి వుంటుందంటే "సంవత్సరం చెప్పలేను. ఆయన ఈ గ్రామంలో 1899 సం॥ వరకు వున్నారు. 1900 లో నాకున్నూ ముత్య రామమూర్తి గారికిన్నీ తమ రిజల్టు స్కూలు వొప్పజెప్పి ఆయన మరోచోటికి బోర్డు స్కూలు మాస్టరుగా వెళ్ళిపోయినారు.

1899 కి పూర్వం ఈ వూళ్ళోదీ బోర్డుస్కూలే. అయితే అప్పట్లో తీసేసారు" అనినారు. ఇంకనూ చెబుతూనే వున్నారు. నేను నామనో వీధిలో అవుధానుల క్రిష్ణయ్యగారిని చిత్రం చేసుకున్నాను!

ఆయన చేతిలో పెద్ద లావుపాటి నల్లని, నున్నని, రూళ్ళకఱ్ఱ వుండేది. పప్పూ బెల్లాల సమేతమైన అక్షరాభ్యాసం యధాశాస్త్రీయంగా గావించి ఆయన నన్ను మా యింటి వద్దనుండి బడిదాకా తక్కిన పిల్లల్తోపాటు నడిపించుకుంటూ, వెంట వెంట ఆ రూళ్ళ కఱ్ఱ చూపిస్తూ వుంటే అంతా భయమే. చదువంటే అంతా భయమే, కామోసు, అని అనుకొన్నాను. కాని బడి అరుగుల మీద, వీధి నిండా ఇసకే! ఇసకమ్మటే గుంటలు. "గుంటలమ్మటే ఓనమాలు దిద్దుకోరా!" అని నన్ను హెచ్చరించారు. ఇదీ ఆ చదువు మచ్చు.

అయితే ఆబళ్లో ఏడాదే చదివానో ఏణ్ణర్థమే చదివానో, ఎవరికి జ్ఞాపకం. ఎవరి క్కావాలి అదంతా. బళ్లోకి వెళ్ళానా లేదా, ఇంటికి తిరిగి వచ్చేనా లేదా అనే నాతల్లి దండ్రుల ప్రశ్న లా రెండేళ్ళూను.

మఱి 1899 కి అప్పుడే నా సరస్వతీదేవి యొక్క రంగ స్థలం వేఱుగా మారింది. ఆ యేడే స్థాపింప బడ్డట్టు కాపడుతుంది రాజమహేంద్రంలో హిందూ లోవర్ సెకండరీ స్కూలు. అందరకూ తెలిసే ఆ సంస్థయొక్క నామం "లక్ష్మీ నరసింహం గారి స్కూలు" ఈ లక్ష్మీ నరసింహంగారంటే కీ॥ శే॥ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు. ఆ బళ్లో ఆ యేట నేను రెండో తరగతిలో చేరి చదివానట! "అంత ప్రాత విద్యార్థిని కావడం వల్లనే నిన్ను అధ్యక్షునిగా ఎన్నుకొన్నాం" అని ఓ వత్సరం వీరేశలింగాస్తికోన్నత పాఠశాలా ప్రాత విద్యార్థి సంఘం వారు నాతో అన్నారు. ఈ సందర్భాలన్నీ ఆ యీ స్థానిక విద్యాలయాల యొక్క నివేదికలు చదివితే బోధపడగలవు.

1899—1900 ఆ ప్రాంతమందు నేను రాజమహేంద్ర వరంలో చదివినప్పుడు, ఉపాధ్యాయుల్లో ఒకాయన మిక్కిలి పొట్టిగా వుండేవారు. ఒకాయన మిక్కిలి పొడుగ్గా ఉండేవారు. మొదటి యొజ్జలు రెండో తరగతిలో పాఠం చెప్పారు. రెండవ యొజ్జలు మూడవ తరగతిలో పాఠం చెప్పారు. వీరిలో మళ్ళీ ఒకర్ని యీ మధ్యను కూడా చూస్తూ వచ్చిన కారణంచేత ఆయన కనబడ్డప్పుడల్లా వెనుకటి వృత్తాంతం నాతో ఏకరు పెడుతూ రావడం వల్ల "కాబోసు కాబోసు" అని అనుకుంటూ కలే నిజమన్న మాదిరిగా కలం సాగించడానికి సాహసిస్తూ వున్నాను.

ఆ ఉపాధ్యాయు లిద్దరూ కూడా నాకు పళ్ళూ ఫలాలూ కొని యిచ్చేవారు. నేను అవి తినేశాక నన్ను యింటికి ముద్దు ముద్దుగా పంపేస్తూ వచ్చేవారు. ఇంటివద్దా బళ్లోనూ బుద్ధిగా వుంటూ వున్నానా లేదా అనే వారి వాకబు. పాఠాలు వచ్చినా రాకపోయినా తగాయిదా వుండేది కాదు నాకు ఆ మాస్టర్లకూ. అయినా పాఠాలు చదవనిదెప్పుడు నేను?

మఱి 1903 సంగతి మొన్న మొన్నటి "బడిగంట— బడిగంట" వ్యాసంవల్ల యావన్మందికీ తేటతెల్లమే! కాని ఆ సంవత్సరం నాకు చదువు చెప్పిన ఉపాధ్యాయు లెవరో కూడా నాకు స్ఫురణకు రావడం లేదు.

1897 కు 1947 ఒక విధంగా లెక్కి స్తే Golden Jubilee Year! నేను తొలుదొ ల్త దిద్దుకొన్న ఓనమాలకూ మేరువు పబ్బంచేయ వలసిన సంవత్సరం! అయితే 1897 సంవత్సరం ఎలాంటిదో గాని—నా జ్ఞప్తి పథంలో దాని రథనేమి నడచిన

రజాయే కానరాదు. ఆ రథం రథం రంగుమాయకుండా రూపం చెడకుండా రహదారీ నొవ్వకుండా 1903 చివఱ వరకూ ! సాగి పోయింది.

1904 జనవరిలో ఏం జరిగిందీ ! **మా మేనమామ** నా జేబులో ట్రాన్సుఫర్ సర్టిఫికెట్టు పెట్టి "**తిన్నగావెళ్ళి** నీవే బళ్లో మున్ను రెండవ తరగతి చదివావో **ఆ** బళ్లోనే రెండవ ఫారంలో చేరి చదువుకో ! నేను నీకూడా వచ్చానా, నేనేనిన్ను పంపించేశాను అంటారు ఇక్కడి అధికారులు. నీవే నీ అంతట నువ్వు యధేచ్ఛగా వెళ్ళిపోయినట్టు వెళ్ళిపోయి, చేరి బాగా చదువుకో" అని హెచ్చరించాడు.

ఆయనగారి లోపల ఆలోచన, మేనమామ మేష్టరుగా వున్న బళ్లో మేనల్లునికి చదువు రాదని.

మా మేనమామ, రామమూర్తిగారు, అప్పట్లో పురపాలక సంఘంవారి మధ్యమ పాఠశాలలో డ్రాయింగు మాస్టరుగా వుండేవారు. తరువాత తరువాత జాతీయోద్యమంలో తీవ్రంగా పాల్గొని జాతీయ విద్యాలయ సంస్థను తాముజీవించి వున్నంత వరకు నడపిన దేశభక్తుడు.

నన్ను వెళ్ళి చేరుమన్నాడే గాని ఆయన, నేను తిన్నగా ఆ బళ్లోకి వెళ్ళి నా అంతట నేను చేరానా అని నా సందేహం. ఎంచేతాఅంటే బడి ఎంత పాతదైనా పగబట్టిన త్రాచులా బుస కొడుతూనే వుంటుంది. అందులోను ఆ యేడు ఆ బళ్లో మాస్టర్లందరివద్దా, డ్రిల్లు మాస్టరు నుండి డిక్టేషన్ మాస్టరుదాకా కూడా గజం, గజం పేకబెత్తాలుండేవి అని ప్రతీతి. మరిన్నీ ఫారమ్సు మాస్టర్లందరూ సత్యసంధులని, విద్యార్థియొక్క

డొక్కచీరేస్తానూ అంటే ఆ మాస్టరు ఆ విద్యార్థియొక్క డొక్క చీరెయ్యక మానడనే పుకారు. కొందఱు కొందఱు ఉపాధ్యాయులు పిల్లవాండ్రకు సుశిక్షనొసగే నిమిత్తం వేతనాలుకూడా తీసికోకుండా పరోపకారాయ పనిచేస్తూ వున్నారని పేరుగాంచేరుట కూడాను. దీన్నంతనూబట్టి చల్లగా నా జేబులో ట్రాన్సుఫర్ సర్టిఫికెట్టుచింపేసి శ్రీరంగపట్నం వెళ్ళిపోదామా అని అనిపించింది. అనిపించిందే కాని చింపెయ్య లేక పోయాను—మా వూరు వెళ్ళలేక పోయాను.

కారణం; సీనారేకు దుకాణాలయొక్క చప్పుళ్లు, మఱీన్ని చెంతనే బొందిలీ దుకాణదారుడమ్మే పంచదార పాకం పొరలింపు గన్న జీడిపప్పుగుండ్లు, ఇంకాచెప్పొస్తే ఆ ప్రాంతమందే ప్రతిష్ట గన్న చలివేంద్రశుద్ధి దాహం! ఒకటా? ఇవన్నీ చాలాకాలం క్రిందటే, నాయొక్క అజ్ఞానమప్పుడే, అస్థిగతమై అటువైపు మళ్ళీ మళ్ళీ ఆకర్షించుకున్నట్టు కాబడ్డాయి. నాకేడుపు రాకుండా తోడునీడై ఎవరో ఆ బళ్లో చేర్పించినట్టుగావుంది. నేను ఆనాడు ఆ బడిలో "రి ఎడ్మిట్" కావడ మనేది!

అంతాచదువే, అంతాకుదురే ఆ బడియొక్క ఏమూల చూచినా: అల్లరి చేసిన పాపాన్ని పోయిన పిల్లవాడే లేడు, ఆ పాఠశాల్లో ఆ యేడు. అల్లరి చేసాడా వాని వొంటిమీద వొకటిన్నర గజం పొడుగుకేనూ, పెద్ద జేను దేవుడులాంటి హెడ్ మాస్టరు చేతినుండిపడి ముప్పాతిక ముప్పాతికలైంది అన్నమాటే.

ఈ మాట నిజమా అని అనుకొనేవాణ్ణి చాలాకాలంనేను. "ముందుంది ముసళ్ళపండగ! అప్పుడే ఏమయింది?" అనే

వాడు నాతోడిసహాధ్యాయి. వాడి మాటలు విన్నప్పుడల్లా ఎప్పుడో నాకూ తప్పదనిపించేది పెళ్ళి.

ఇలా వుంటూ వుండగా ఆ సహాధ్యాయి నన్ను పరధ్యానిగా జేసి నాపనిపట్టిద్దామనే తలంపుతో ఓనాడు "బరిపోవాలి! ఈ సీనారేకు దుకాణాలుండాలి! బరిపోవాలి, జీడిపప్పు, చీనా గుండ్లు ఇలాగే అమ్మాలి బరిపోవాలి శుద్ధి దాహము ఇంతచిక్కగాను ఎల్లకాలం తాగాలి." అంటూ పాడాడు. "బరిపోతే అవీ వుండవు. అవి పోతే బరీ వుండదు రెండింటికీ అవినాభావ సంబంధం అన్నాను నేను. అప్పట్లోనా అభిమాన భాష సంస్కృతము లెండి, అతడు నా సహాధ్యాయి వట్టి తెనుగు పోతు, "అవన్నీ నాకు తెలియదు, ఈ బరిపోవాలి అని నాతో పాటు నీవు కూడా కోరతావా? లేదా? అని గ్రుడ్లురిమేడు. వాడు గ్రుడ్లురిమితే నేను నా గుండీలు ఒదులు చేసినవాణ్ణై "మావూళ్లో నడువీధిలో చింతచెట్టు మీద వేలకువేలు కొంగలువాలి వుంటాయి. ఎల్లప్పుడూ, వాటికి నివాసం ఆ చింత చెట్టే. చింతకొట్టేస్తే కొంగలుంటాయా?" అని సవాలేసాను. "ముందే కొంగ లెగిరి పోతే?" అని వాడు మొరాయించాడు. నేను మిన్నకుండి "చింత?" అని నాలో నేను ప్రశ్నించుకుంటూ నా గోళ్ళకేసి చూచుకున్నాను. గోళ్ళమీద తెల్లని చిట్టిగీరలు, "కొంగ కొంగ గోళ్ళు" అన్న ఆటగీరలు అతిగోముగా వెలిసిపోని మురిపెంతో వెలసివున్నాయి. "చింతా కొట్టేయ్యి తగ్గదే ఎగిరే కొంగను కనబడకుండా, చేస్తుంది చింత" అన్నాను ఎట్టకేలకు ఎలుగెత్తి.

వెనక పొంచుండి తరగతి గురువు విన్నాడో ఏమో "చింత? కొంగ? చింత కొంగ? అంటే చదువు వొస్తుందిరా

అబ్బీ!" అని వెంటనే చీటి వ్రాసి బంట్రోతుకిచ్చి, బంట్రోతుతో కూడా నన్ను హెడ్‌మాస్టరుగారి రూమ్‌లోకంపాడు. ఆపాళంగా వ్రాసింది చూడకుండా బంట్రోతు నడక్కుండా ఏమని వేయను విశేషణం? ఏమన్నా "గుడ్డే" ఆపై యొజ్జలు టపటపా నాచెరో అరచేతిలోను చెరోదెబ్బా కొట్టేశారు. బాగా జ్ఞాపకం అరచేతులు రెండూ ఎఱ్ఱగా కందిపోయి రేఖలు నెత్తురు గాళ్ళుగా మారాయి. కళ్ళమ్మట నీటి వాకలు గుమిగూడి కావేరీ జలపాతంలా పడ్డాయి.

కాని నా నెత్తురుగాని నా కన్నీరుగాని రెండోవాని క్కాపఱచకుండా, గుప్పిళ్ళు పట్టుకు, ఠెప్పలు కట్టుకు, గోళ్ళ మీది కొంగ ఠెక్కల రంగు చెఱిగి పోయేలాగు వుండిపోయాను. గుండె గొణుగు కూడా మఱచి; వెళ్లు అన్నాక వెలువడ్డాను.

నాటి నుండి సీనారేకు దుకాణాల భజన వినబుద్ధి కలిగిందిలేదు. జీడిపప్పుగుండు మీది పంచదార పాకపు మేలి ముసుగువంక చూడ్డమే మానేశాను. చలివేంద్రళుద్ధి దాహం చింతగింజ మునగంది అయినావర్జించాను.

నడువీధి చింత అన్నా, ఆ చింతమీది కొంగలన్నా మరీ అసహ్యమై పోయినాయి.

ఇక బడిమాట వేరే చెప్పాలా! సహాధ్యాయి వినకుండా సహాధ్యాయి కంటె గట్టిగా శపించి పారేశాను ఆ సంజ "బరి పోవాలి, బరిపోవాలి!" అని.

పోయింది కూడాను ఆ బడి! ఆ బడి లేదు ఇప్పు డక్కడ. అక్క డిప్పుడో కాఫీహొటల్ ప్రబలి వుంది! యిపోయా ఆ సీనారేకు జలిబిలి స్వేచ్ఛ గానాలూ. జీడిపప్పు మజాలు.

ఆ అంగళ్ళన్నీ పెద్ద మసీదుకేసి జరిగి పోయినాయి. లేవు లేవిప్పుడు మునుపటి చోటను అవి. చుట్టూ మందుల దుకాణా లున్నాయి యిప్పుడు. ఆ చలివేంద్ర స్థలమన్నది అక్రమ ఆక్రమణగా తేలి వుంది నేడు. ఎక్కడా కనపడ్డమే లేదు. మా వూళ్లో నేనన్న చింతా కొట్టేశారు. ఈ దరిమిలాను, చింత కొట్టిన వంతను కొంగలూ వ్రాలడం చాలించు కొన్నాయి. ఎక్కడ వ్రాలడం అవి? వేలకు వేలు వ్రాలి ఆహ్లాదం గొలిపేవి అవి మున్ను. ఇప్పుడు వచ్చినీ్న ఎక్కడ వ్రాలడం అవి?

అవి నిజంగా ఒక్కొక్కప్పుడు యోజిస్తే నాకు రాజమ హేంద్రవరము నడిబజారునుండి, మా యూరి నడివీధి వరకూ సమస్తం శూన్యాకాశంగా కనిపిస్తుంది.

...."తెల్లవారను గడుసరి గొల్లవారు" ఈ రోజున వై దొలగినా! అఖండ భారతవర్షం భిన్నాభిన్నమైనా ఏర్పడే శూన్యాకాశం మాట? "కటా! ఏమిటా?" అని అనిపిస్తుంది.

....

కిసిమిసి పండగ సరదా

"కిసిమిసి" పండగసరదాలు డిశంబరు 25వ తేదీని ప్రారంభం! కాదు—డిశంబరు 24 సాయంత్రమే కొంచెం కొంచెంగా సంధ్యా రాగంతో ప్రారంభిస్తే ప్రారంభించొచ్చు. మఱి 24 తెల్లవాఱ గట్ల నగర సంకీర్తనం, ఉదయం గుడిలో ప్రార్ధన, ప్రతియింటా "కిసిమిసి" వృక్షస్థాపన—వీటితో కిసిమిసి పండగ భూమికి దిగింది పూర్తిగా దిగింది అని అనుకోవాలి. ఏదైనా—25 వ